సాక్షి
తిరుపతి
సోమవారం । 13 । ఫిబ్రవరి । 2023


తిరుపతి బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.54,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,150
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.70,000
రిటైల్ వెండి గ్రాము	రూ.72



	గరిష్టం	కనిష్టం
తిరుపతి	35	18
చిత్తూరు	34	17
తిరుమల	30	13
గూడూరు	35	19
నగరి	36	18



అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

తిరుచానూరు(చంద్రగిరి): వారాంతపు కార్యక్రమం లో భాగంగా శిల్పారామంలో ఆదివారం భైరెడ్డిపల్లి కళాతరంగిణి బృందం చేసిన జానపద, కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి.

న్యూస్‌రీల్

కోటీశ్వరులకు కొమ్ముకాసే పార్టీ టీడీపీ


తిరుమల శ్రీవారిని దర్శించుకున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

తిరుమల/చిత్తూరు రూరల్: టీడీపీ ఎప్పుడూ కోటీశ్వరులకు కొమ్ము కాసే పార్టీ అని, అందుకే నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఒక్క కులం వెంట పరుగెడుతోందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి విమర్శించారు. ఆదివారం ఆయన శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ వెలుపల మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. దేశమంతా ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైపు చూస్తోందన్నారు. వెన్నుపోటుదారులు అంతా ఒక్కటైనా సీఎం జగన్‌ను ఏమీ చేయలేరని చెప్పారు. అప్పట్లో జగనన్న చేపట్టింది ప్రజా సంకల్పయాత్ర అని, అందుకే అప్పట్లో ప్రజలు బ్రహ్మరథం పట్టారని చెప్పారు. ఇప్పుడు నారా లోకేష్‌ది రంజింపని పాదయాత్ర..మెప్పించని స్పీచ్ అని దుయ్యబట్టారు. యాత్రకు జిల్లాలో జనాలు రాకపోవడంతో తమిళనాడు ప్రజలను కూలీలుగా తోలుకొస్తున్నారన్నారు. చంద్రబాబు కూడా తన సామాజిక వర్గానికే ప్రాధాన్యత ఇస్తున్నారని, ఇందుకు జీడీనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ నియామకమే నిదర్శనమన్నారు. బెంగళూరు నుంచి తమ సామాజికవర్గం వాళ్లను తీసుకొచ్చి రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. యువగళం పాదయాత్రలో జగనన్న మంజూరు చేసిన రోడ్డు శిలాఫలకాన్ని ధ్వంసం చేశారని మండిపడ్డారు. వనదుర్గాపురం, డీఎస్ కండ్రిగలో ఫారెస్ట్ శాఖ క్లియరెన్స్ ఇచ్చిందని, రూ.194 కోట్లతో అగ్రిమెంట్ అయి రేపో, ఎల్లుండో రోడ్లు వేస్తున్నామని తెలిపారు. దళిత వర్గాలను అన్యాయం చేసిన వ్యక్తి చంద్రబాబు అని ధ్వజమెత్తారు.

చంద్రప్రభపై చంద్రశేఖరుని కటాక్షం


తిరువీధుల్లో విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

పిచ్చాటూరు: నాగలాపురం మండలం సురుటుపల్లెలోని ప్రముఖ శ్రీసర్వమంగళాదేవి సమేత పళ్లికొండేశ్వరస్వామి ఆలయ మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారు చంద్రప్రభ వాహనంపై విహరిస్తూ భక్తులకు కటాక్షించారు. ఉదయం ఆలయంలో స్వయంభు శ్రీవాల్మీకేశ్వరస్వామి, శ్రీమరగదాంబిగ తాయారు, శ్రీ పళ్లికొండేశ్వరస్వామి, శ్రీరామలింగేశ్వరస్వామి, దాంపత్య దక్షిణామూర్తికి ప్రత్యేక అభిషేక పూజలు, అలంకరణలు జరిగాయి. యాగ పూజలు నిర్వహించారు. సాయంత్రం పార్వతీ, పరమేశ్వరుల ఉత్సవమూర్తులను పట్టుపీతాంబరాలు, గజ పుష్పమాలలు, విశేషాభరణాలతో అలంకరించారు. చంద్రప్రభ వాహనంపై పరమేశ్వరుడిని, తిరుచ్చి వాహనం పార్వతీదేవిని కొలువుదీర్చి ఊరేగించారు. అడుగడుగునా భక్తుల కర్పూర నీరాజనాలు సమర్పించి తరించారు.


ఆలయంలో విద్యుద్దీప కాంతులు


శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయ ముఖచిత్రం

ఇల కైలాసం.. బ్రహ్మోత్సవ సంరంభం

మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఇల కైలాసం శ్రీకాళహస్తి ముస్తాబైంది. సోమవారం నుంచి 13 రోజుల పాటు అంగరంగ వైభవంగా ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఆలయం లోపల, పరిసరాలు విద్యుద్దీప కాంతులతో నవ్యకాంతులీనుతున్నాయి. వివిధ రాష్ట్రాల నుంచి తెప్పించిన వివిధ రకాల పుష్పాలు, పండ్లతో సర్వాంగ సుందరంగా అలంకరిస్తున్నారు. స్వాగత ఆర్చీలు భక్తులను ఇట్టే ఆకర్షిస్తున్నాయి. 3లక్షలకు పైగా భక్తులు వస్తారన్న అంచనాలతో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

- శ్రీకాళహస్తికి మహా శివరాత్రి శోభ
- నేటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- వివిధ రకాల పుష్పాలు, పండ్లతో అలంకరణ
- ఆకట్టుకుంటున్న లేజర్ షో, విద్యుద్దీప శోభ
- భక్తుల రద్దీకి తగినట్లుగా దేవస్థానం విస్తృత ఏర్పాట్లు

సాక్షి నెట్‌వర్క్: శ్రీకాళహస్తి క్షేత్రం మహా శివరాత్రి శోభను సంతరించుకుంది. ఎటు చూసిన ఆధ్యాత్మిక సందడే. అశేషంగా తరలి వచ్చే భక్తుల కోసం దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఐదు భారీ షెడ్లు నిర్మించింది. ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ఈఓ సాగర్‌బాబు తెలిపారు. అలాగే ప్రత్యేకంగా మరుగుదొడ్లు, స్నానపు గదులు, బస సౌకర్యాలు కల్పించారు. ఆలయం వద్ద కై లాసం సెట్, శ్రీకాళహస్తి ప్రాముఖ్యతను తెలిపేందుకు లేజర్ షోను ఏర్పాటు చేశారు. స్వర్ణముఖిలో శివుడికి, వినాయకుడు అభిషేకం చేస్తున్నట్లు 10 అడుగుల విగ్రహం ఇట్టే ఆకర్షిస్తోంది. సుపథం మండపం వద్ద వివిధ రకాల పుష్పాలతో 20 అడుగుల శివలింగాన్ని ఏర్పాటు చేస్తున్నారు.


లింగోద్భవమూర్తి

ఊరేగింపులో ప్రత్యేకాకర్షణ

బ్రహ్మోత్సవాల్లో ఉదయం, రాత్రి జరిగే వాహన సేవల ముందు దేవతామూర్తుల వేషధారణలు, కోలాటాలు, కొయ్యబొమ్మలు, కేరళవాయిద్యాలు, నాలుగు మాడ వీధుల్లో విద్యుద్దీపాలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాయి. స్వామి అమ్మవార్ల రథోత్సవం, పల్లకీ సేవ, తెప్పోత్సవం, కైలాస గిరిప్రదక్షిణకు అశేషంగా వచ్చే భక్తులకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. 21 కిలోమీటర్ల కైలాస గిరిప్రదక్షిణ చుట్టి వచ్చేందుకు భక్తులకు ఇబ్బందులు పడకుండా రూ.16 కోట్లతో రహదారి ఏర్పాటు చేశారు. వాహనాలకు, రథానికి రంగులు అద్దారు. సాంస్కృతిక ప్రదర్శనలకు నటరాజ నాట్య నిలయమైన ధూర్జటి ప్రాంగణం రూపుదిద్దుకుంటుంది.

ఉమ్మడి జిల్లాలో..

తిరుపతి కపిలేశ్వరాలయం, నాగలాపురం మండలం సురుటుపల్లెలోని శ్రీపళ్లికొండేశ్వరాలయంలో మహా శివరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. గుడిమల్లంలోని శ్రీపరశురామేశ్వరాలయం, బంగారుపాళెం మండలంలోని మొగిలీశ్వరాలయం, నగరి సమీపంలోని బుగ్గ అగ్రహారం, సదాశివ కోన, కైలాసకోన, చంద్రగిరి సమీపంలోని ముక్కోటి దేవాలయం, చౌడేపల్లెలోని అభీష్టద మృత్యుంజయేశ్వరాలయం, ఇతర పలు ఆలయాలు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సిద్ధమయ్యాయి.

నేడు భక్తకన్నప్ప ధ్వజారోహణం


కన్నప్ప ఆలయం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భక్తుడైన కన్నప్పకే అగ్ర తాంబూలం. సోమవారం భక్తకన్నప్ప ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. సాయంత్రం భక్తకన్నప్ప ఊరేగింపు, అనంతరం ఆలయంలో అంకురార్పణ పూజలతో మహాశివరాత్రి ఉత్సవాలకు నాంది పలుకుతారు.సాయంత్రం ధూర్జటి కళాప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి.

- 14న సకల దేవతలను ఆహ్వానిస్తూ ఆలయంలో ధ్వజారోహణం. దీన్నే దేవరాత్రి అని అంటారు. రాత్రి వెండి అంబారి సేవ
- 15న భూతరాత్రి. ఉదయం సూర్యప్రభ, చప్పరం, రాత్రి భూత, శుకవాహన సేవలు
- 16న గాంధర్వరాత్రి. ఉదయం హంస, యాళి, రాత్రి రావణ, మయూర వాహనాలపై ఊరేగింపు
- 17న నాగరాత్రి. ఉదయం హంస, శుక వాహనం, రాత్రి శేష, యాళి వాహన సేవలు
- 18న మహా శివరాత్రి బ్రహ్మోత్సవం. ఉదయం నుంచి స్వామివారికి 11 అభిషేకాలు, ఉదయం ఇంద్ర, చప్పర వాహనసేవ, రాత్రి నంది వాహనంపై, సింహవాహనంపై స్వామి, అమ్మవార్ల విహారం.

19న రథోత్సవం. సాయంత్రం తెప్పోత్సవం

- 20న కల్యాణోత్సవం. స్వామివారు గజవాహనం, అమ్మవారు సింహవాహనంపై ఆలయం నుంచి పెండ్లి మండపం వద్దకు చేరుకుంటారు. కల్యాణోత్సవం అనంతరం రుద్రాక్ష అంబారిపై ఆలయానికి ఊరేగింపు.
- 21న సభాపతి కల్యాణం
- 22న గిరి ప్రదక్షిణ రాత్రి అశ్వ, సింహ వాహనాలపై స్వామి, అమ్మవార్ల ఊరేగింపు
- 23న ధ్వజావరోహణం, రాత్రి కేడిగ వాహన సేవ
- 24న పల్లకీ సేవ
- 25న ఏకాంతసేవ
- 26న శాంతి అభిషేకాలు




శోభాయమానంగా ఆలయ పరిసరాలు

రూ.4 కోట్ల నిధులు విడుదల



“రాష్ట్ర దేవదాయశాఖ నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రూ.4కోట్ల నిధులు విడుదలయ్యాయి. అత్యంత వైభవంగా మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తాం. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్, ఎస్పీ, అన్ని శాఖల అధికారులతో ఉత్సవాల నిర్వహణపై సమావేశాలు నిర్వహించాం. అన్ని శాఖల సమన్వయంతో ఉత్సవాలను దిగ్విజయంగా నిర్వహిస్తాం. పాలక మండలి చైర్మన్, సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, ఆలయ ఉద్యోగులను సమన్వయం చేసుకుంటూ ఎక్కడా చిన్న లోటుపాట్లు లేకుండా ఉత్సవాలను నిర్వహిస్తాం.

– సాగర్‌బాబు, ఈఓ, శ్రీకాళహస్తి దేవస్థానం

వైభవంగా బ్రహ్మోత్సవాలు



కోవిడ్ తర్వాత ఆంక్షలు లేని మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు ఈ ఏడాది జరగనున్నాయి. ఈ ఉత్సవాలకు 3లక్షలకు పైగా భక్తులు వస్తారని అంచనా. పుష్పాలంకరణ, విద్యుత్ అలంకరణ తిరుమల తరహాలో ఏర్పాటు చేస్తున్నాం. లేజర్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఎక్కడా చిన్నపాటి పొరబాట్లు లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నాం. గతంలో ఎన్నడూ లేని రీతిలో ఈసారి ఉత్సవాల్లో సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తాం.

– బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్యే, శ్రీకాళహస్తి

సామాన్య భక్తులకు పెద్దపీట



మా పాలక మండలికి ఇది రెండవ బ్రహ్మోత్సవాలు. గతంలో జరిగిన చిన్నపాటి పొరపాట్లను కూడా సరి చేసుకుని ఈ సారి పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నాం. సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తాం. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఆలయాధికారులు, పాలక మండలిని సమన్వయం చేసుకుంటూ కనీవినీ ఎరుగని తీరితో దిగ్విజయంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం.వాహన సేవలు కూడా భారీగా నిర్వహించనున్నాం.

– అంజూరు తారక శ్రీనివాసులు, పాలకమండలి చైర్మన్, శ్రీకాళహస్తి దేవస్థానం

అమ్మాయిల సంఖ్యే తక్కువ

రోజురోజుకు అమ్మాయిల జననాల సంఖ్య తక్కువగా నమోదవుతోంది. రోజువారీ కాన్పుల సంఖ్యను పరిశీలిస్తే అబ్బాయిల సంఖ్యే ఎక్కువగా ఉంటోంది. జిల్లాలో ఈ ఏడాది నమోదైన గణాంకాలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టం అవుతోంది. ప్రభుత్వం లింగ నిర్ధారణ పరీక్షలపై ఉక్కుపాదం మోపుతోంది. అయినా అక్కడక్కడా లోగుట్టుగా లింగ నిర్ధారణ పరీక్షలు చేసి అమ్మాయి అని తెలియగానే పురిట్లోనే చంపేస్తున్నారు. దీన్ని అధిగమించడానికి వైద్య ఆరోగ్య శాఖ యంత్రాంగం సిద్ధమైంది.

- లింగ నిర్ధారణ పరీక్షలపై ప్రభుత్వం ఉక్కుపాదం
- అయినా లోగుట్టుగా పరీక్షలు
- ఆడపిల్ల అనగానే పురిట్లోనే చంపేస్తున్న వైనం
- ఏటా పెరుగుతున్న మగ పిల్లల సంఖ్య
- శిశుమరణాల కట్టడికి ప్రభుత్వం చర్యలు



గత మూడేళ్లుగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జనన వివరాలు (2022 సంవత్సరం ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు చిత్తూరు జిల్లా మాత్రమే)

వ.సంఖ్య	సంవత్సరం	మగ పిల్లలు	ఆడ పిల్లలు	మొత్తం	నిష్పత్తి
1	2019	31673	22428	60101	898
2	2020	32209	29255	61464	908
3	2021	33414	30222	63636	904
4	2022	1175	981	2156	835

చిత్తూరు రూరల్: జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో జన్మించిన జననాల సంఖ్యలో మగ శిశువుల కంటే ఆడశిశువులే తక్కువగా పుడుతున్నారు. కొన్నేళ్ల కిందట వరకు ఆడ, మగ జననాల మధ్య వ్యత్యాసం పెద్దగా ఉండేది కాదు. ప్రస్తుతం లింగ నిష్పత్తిలో గతంలో లాగానే మార్పులు కనిపిస్తున్నాయి. 2022 (ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు) ఏడాదిలో చూస్తే లింగ నిష్పత్తి 835గా ఉందని అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. ఈనేపథ్యంలో ప్రభుత్వం లింగ నిర్ధారణ పరీక్షలను పూర్తిగా నిషేధించింది. అధికారులు తరచూ తనిఖీలు చేస్తూ లింగ నిర్ధారణ కట్టడికి చర్యలు చేపడుతున్నారు. అయినా కొన్ని డయాగ్నస్టిక్ సెంటర్లు, ప్రైవేటు ఆస్పత్రుల్లో నేటికీ గుట్టుగా లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల జిల్లాలో ఏప్రిల్ నుంచి డిసెంబర్ దాకా జననాల నమోదును పరిశీలిస్తే జిల్లాలో 1175 మంది అబ్బాయిలకు 981 మంది అమ్మాయిలే ఉన్నట్లు తేలింది.

జిల్లావ్యాప్తంగా చూస్తే..

జిల్లాలో జిల్లా ఆస్పత్రి ఒకటి, ఏరియా ఆస్పత్రి 3, సీహెచ్‌సీలు 7, పీహెచ్‌సీలు 50 దాకా ఉన్నాయి. రోజూ జిల్లావ్యాప్తంగా 50 నుంచి 60 మంది పిల్లలు పుడుతున్నారు. అలాగే ప్రైవేటు ఆస్పత్రులు 35కు పైగా ఉన్నాయి. వీటితో పాటు అనధికారికంగా పలు ఆర్‌ఎంపీ క్లీనిక్‌లలో కూడా ప్రసవాలు జరుగుతున్నాయి. ప్రధానంగా ఈ కేంద్రాలు అబార్షన్‌కు కేంద్ర బిందువులుగా మారాయి. ఈ కారణంగానే ఆడపిల్లల సంఖ్య తక్కువగా, మగశిశువుల సంఖ్యే అధికంగా నమోదవుతున్నాయి.

పాపం పసి ప్రాణాలు..

మిగతా జిల్లాలతో పోల్చితే మన జిల్లాలో శిశు మరణాల సంఖ్య తక్కువే. కానీ ఈఏడాది గణాంకాలతో పోల్చితే ఆందోళన కలిగిస్తోంది. 2023(ఏప్రిల్ నుంచి డిసెంబరు)లో గ్రామాలు, పట్టణాల్లో పుట్టినప్పటి నుంచి ఏడాది వరకు 163 శిశు మరణాలు చోటు చేసుకున్నాయి. అలాగే 5 ఏళ్లలోపు పిల్లలు ఈ ఏడాదిలో ఐదుగురు మృతి చెందారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా తీసుకుంటే కూడా గత నాలుగేళ్లల్లో ఆడపిల్లల సంఖ్య తక్కువగానే నమోదవుతోంది. ఈ విషయంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తమై ప్రతి నెలా సమీక్షలు నిర్వహించి శిశుమరణాల కట్టడికి చర్యలు చేపడుతున్నారు.

ఆడబిడ్డల సంఖ్య తగ్గడానికి కారణాలు..

- ఆడపిల్ల అనగానే వివక్షత చూపడం
- నిబంధనలకు విరుద్ధంగా స్కానింగ్‌లు చేస్తూ, భ్రూణ హత్యలకు పాల్పడడం
- వారసత్వం పేరుతో మగబిడ్డ ఉండాలని మూఢనమ్మకం

అవగాహన అవసరం..



“ఆడ, మగ అనే వ్యత్యాసం చూడకూడదు. ఇద్దరూ సమానమే. చాలామంది ప్రస్తుత పరిస్థితుల్లో మగ బిడ్డ కంటే ఆడ బిడ్డే మేలనుకుంటున్నారు. ఈక్రమంలో ఇప్పుడు ఈ వ్యత్యాసలు పెద్దగా కనిపించడం లేదు. భ్రూణ హత్యలు కూడా జరగకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటాం. స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టాం. వివక్షతపై పూర్తిస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రజల్లో కూడా మార్పు రావాలి.

– రవిరాజు, డీఐఓ

నేడు కలెక్టరేట్‌లో స్పందన

తిరుపతి అర్బన్: తిరుపతి కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి ఆదివారం తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రతి విభాగం ఉన్నతాధికారి తప్పకుండా హాజరుకావాలని ఆదేశించారు. తిరుపతి సెంట్రల్ బస్టాండ్ నుంచి రోజూ కలెక్టరేట్ వరకు ఆర్టీసీ సర్వీసులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అర్జీలు రాసేందుకు ముగ్గురు వీఆర్వోలను నియమించామన్నారు.

ఆర్జితం ఇన్‌స్పెక్టర్‌పై క్రమశిక్షణ చర్యలు


దామోదరం

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయ ఆర్జితం ఇన్‌స్పెక్టర్ దామోదరంపై టీటీడీ అధికారులు క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. గత నెల 26వ తేదీన అమ్మవారి ఆలయంలో పీఎస్ ప్రోటోకాల్ కానిస్టేబుల్ శేషాద్రిపై దామోదరం దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు అతనిపై తిరుచానూరు పోలీసులు కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరిచారు. ఆయన బెయిల్‌పై విడుదల అయ్యారు. దాడి ఘటనపై విజిలెన్స్ అధికారుల విచారణ చేపట్టి నివేదికను అందజేశారు. నివేదిక ప్రకారం క్రమశిక్షణ చర్యల కింద దామోదరంను విజయవాడ డిప్యూటీ ఈఓ కంట్రోల్‌కు బదిలీ చేస్తూ ఆదివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం తెలిపారు.

బావిలో పడి కూలీ మృతి?

చిల్లకూరు : మండలంలోని పారిచెర్లవారిపాళెంలో ఆదివారం రాత్రి నీటి కోసం బావి వద్దకు వెళ్లిన తంబి రాజశేఖర్ (25) ఆచూకీ తెలియకపోవడంతో ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెంది ఉంటాడని అనుమానిస్తున్నారు. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. కూలి పనులు చేసుకుంటూ ఇతను జీవనం చేస్తున్నాడు. కొంత కాలంగా ఫిట్స్ వ్యాధి ఉండగా చికిత్స తీసుకుంటున్నాడు. ఈ క్రమంలోనే ఆదివారం కూడా పనికి వెళ్లి ఇంటికి వచ్చాడు. స్నానం చేసేందుకు నీరు తెచ్చేందుకు ఇంటికి సమీపంలో ఉన్న బావి వద్దకు వెళ్లాడు. ఎంతకూ రాకపోవడంతో కుటుంబ సభ్యులు అక్కడికి వచ్చి చూశారు. అతని ఆచూకీ తెలియలేదు. బావి వద్దకు వచ్చిన సమయంలో మూర్ఛ రావడంతో ప్రమాదవశాత్తు బావిలో ఉంటాడని అనుమానించారు. బావిలో నీరు నిండుగా ఉండడంతో స్థానికులు కూడా ఏమీ చేయలేక పోయారు. గూడూరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాక సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. బావి నుంచి నీటిని తోడేందుకు ప్రయత్నిస్తున్నారు. దీనిపై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.

ఆ వాక్కు.. ఆకాశవాణిలో పరిమళించింది..

రేడియోపై ఉన్న ఆసక్తి అతి చిన్న వయస్సులోనే రాష్ట్రంలోనే అతి పిన్న వయస్సు రేడియో జాకీగా మార్చింది. అలా అది పెరుగుతూ..పెరుగుతూ ఐఏఎస్ విత్ సాయి కార్యక్రమం వరకూ సోపానాలు వేసింది. నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం కైవసం చేసుకునేందుకు బాటైంది. సోమవారం ప్రపంచ రేడియో దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

- ఐఏఎస్ విత్ సాయి కార్యక్రమంతో రాణించిన రావల
- నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించిన సాయి గిరీష్
- అతి పిన్న వయస్సులోనే రేడియో జాకీగా గుర్తింపు
- నేడు ప్రపంచ రేడియో దినోత్సవం



కోయంబత్తూరులో నోబుల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు అందుకుంటున్న సాయి గిరీష్, రేడియో స్టూడియోలో సాయి

గూడూరు: పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చనేందుకు రేడియో జాకీ సాయి ఉదాహరణ. రేడియో జాకీ మన గూడూరు సాయిగా నేడు అందరికీ సుపరిచితుడయ్యాడు. పట్టణంలోని గమళ్లపాళెం ప్రాంతానికి చెందిన రావల రుక్మిణి, నాగరాజుల కుమారుడు సాయి గిరీష్. తల్లి ఆర్టీసీ కండక్టర్‌గా పనిచేస్తున్నారు. తండ్రి కొన్నేళ్ల కిందట మృతి చెందారు. సాయి గిరీష్‌కు చిన్న వయస్సు నుంచే రేడియో..అంటే మక్కువ, ఎక్కువ సమయం రేడియోలో ప్రసారమయ్యే కార్యక్రమాలను వింటుంటే వాడు. ఈ ఆసక్తిని గమనించిన తల్లి 2015–16వ సంవత్సరంలో 8వ తరగతి చదువుతుండగా, వేసవి సెలవుల్లో తిరుపతిలోని పెదమ్మ వద్దకు పంపింది. వాళ్లు ఈ బాలుడిని తిరుపతి రేడియో స్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడ స్టేషన్ డైరెక్టర్ విజయ, అనౌన్సర్ నిర్మాల ఆ చిన్నారిలోని ఉత్సాహాన్ని గమనించి పద్యాలు చెప్పమన్నారు. వెంటనే సాయి ఎలాంటి బిడియం లేకుండా ఉప్పు కర్పూరంబు ఒక్క పోలిక నుండు..చూడ చూడ రుచుల జాడ వేరు..అంటూ పద్యాన్ని ఆలపించాడు. పిల్లల పాటలు పాడాడు. వారు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. ఈ క్రమంలో అదే ఆదివారం బాలానందంలో సాయి పాడిన పాటలు, పద్యాలు రేడియోలో ప్రసారం అయ్యాయి. అప్పటి నుంచి సెలవు రోజుల్లో తరచూ అక్కడికెళ్లి పాటలు, పద్యాలు ఆలపించేవాడు. స్టేషన్ అధికారులకు లెటర్లు రాస్తూ సూచనలు అందజేసేవాడు. 2016లో 9వ తరగతిలోనే బెస్ట్ లిజన్ అండ్ సజిషనర్‌గా తిరుపతి రేడియో స్టేషన్ వారు గుర్తించి సత్కరించారు. 2017లో సాయి పదవ తరగతి చదువుతూనే తెలుగు–1 రేడియో, తెలుగు ఎన్‌ఆర్‌ఐ, స్వరా, రేడియో గీతం అనే ఆన్‌లైన్ రేడియోలోని కార్యక్రమాలను ఇంటి వద్ద నుంచే పంపుతుండేవాడు. ఈ కార్యక్రమాలను విదేశాల్లో ఉన్న తెలుగు వారు బాగా వింటూ పలు కామెంట్లు పంపేవారు. అలాగే స్వరాలహరి, భావలహరి, ఫీల్ మై లవ్, నమస్తే నెల్లూరు, శుభోదయం సింహపురి తదితర కార్యక్రమాల ద్వారా పలు డాక్యుమెంటరీలు చేస్తూ స్వరాన్ని వినిపించేవారు. 2019, ఫిబ్రవరిలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదివే సమయంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సం సందర్భంగా నెల్లూరులో రేడియో స్టేషన్‌ను ప్రారంభించారు. ముత్యాలమ్మ జాతర, పెనుశిల నరసింహ స్వామి ఉత్సవాలు డాక్యుమెంటరీ చేశాడు. అతి చిన్న వయస్సులో రేడియో జాకీగా పేరు తెచ్చుకున్నాడు. 2020 డిసెంబర్‌లో నోబుల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును కోయంబత్తూరులో అందుకున్నారు.


తిరుపతి ఆలిండియా రేడియో సిల్వర్ జూబ్లీ ఫంక్షన్‌లో సత్కారం

పాపులర్ ఇంటర్వ్యూలు

2021లో డిగ్రీ చదువుతుండగా, కమ్యూనిటీ రేడియా విజయవాడ, గుంటూరు అవకాశం వచ్చింది. ఈ క్రమంలో పలు కార్యక్రమాలు చేశారు. ప్రస్తుతం తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ ఎంసీఏ మొదటి చదువుతూ ఖాళీ సమయాల్లో కమ్యూనిటీ రేడియోలో వివిధ కార్యక్రమాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే 'ఐఏఎస్ విత్ సాయి'అనే కార్యక్రమం బాగా పాపులర్ అయ్యింది. ఈ కార్యక్రమం ద్వారా సివిల్ సర్వీసెస్ సేవలు, అది సాధించేందుకు వారు వేసుకున్న ప్రణాళిక, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా మొదటి సారిగా గంధం చంద్రుడు ఐఏఎస్‌ను ఇంటర్వ్యూ చేశారు. ఇది సక్సెస్ అయ్యింది. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో నవరత్నాలు, అభివృద్ధి కార్యక్రమాల లబ్ధిని కళ్ల కట్టినట్లుగా వివరించాడు. పలువురు అధికారులను ఇంటర్వ్యూలు చేస్తూ అభివృద్ధి కార్యక్రమాల ప్రయోజనాలను తన రేడియో ద్వారా విపులీకరిస్తున్నాడు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ చోరీ



పాలసముద్రం : మండలంలోని వెంగళరాజుకుప్పంలో రైతు సుబ్రమణ్యంకు చెందిన భూమి వద్ద ఉన్న ఓ ట్రాన్స్‌ఫార్మర్‌లో దొంగలు రాగి(కాపర్)ను చోరీ చేసిన సంఘటన వెలుగు చూసింది. దీనిపై బాధితుడు ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం సుబ్రమణ్యం మాట్లాడుతూ శనివారం సాయంత్రం కూడా ట్రాన్స్‌ఫార్మర్ బాగుందని, ఆదివారం ఉదయం లేచి పొలం వద్దకు వెళ్లి మోటారు వేయాలని చూస్తే ట్రాన్స్‌ఫార్మర్ కింద పడి ఉందన్నాడు. దగ్గరకు వెళ్లి చూస్తే అందులోని ఆయిల్, రాగి(కాపర్)ను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారని వాపోయాడు.

సచివాలయంలో గేట్ల చోరీ



పాకాల : మండలంలోని చెన్నుగారిపల్లె సచివాలయంలో గుర్తు తెలియని దుండగులు రెండు గేట్లను చోరీ సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఆదివారం స్థానిక పంచాయతీ కార్యదర్శి కిషోర్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు ..మొదటి అంతస్తులో హాలు ప్రవేశం వద్ద ఏర్పాటు చేసిన గేటు, బయట వ్యక్తులు పైనుంచి లోనికి రాకుండా టాప్‌లో వేసే రెండు ఐరన్ గ్రిల్స్‌ను దుండగులు చోరీ చేశారని పేర్కొన్నారు. దుండగులు పదునైన గెడ్డపారలు ఉపయోగించి గోడలను పగలగొట్టి వీటిని తీసుకెళ్లారని తెలిపారు.

పోలీసు లాంఛనాలతో రఫీ అంత్యక్రియలు



హెడ్ కానిస్టేబుల్ రఫీ మృతదేహం వద్ద వందన సమర్పణ చేస్తున్న పోలీసులు, ఇన్‌సెట్ రఫీ (ఫైల్)

నాయుడుపేటటౌన్: ఓజిలి పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ మహ్మమద్ రఫీ(49) ఆదివారం ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన అంత్యక్రియలను సాయంత్రం ముస్లిం శ్మశాన వాటికలో పోలీసు లాంఛనాలతో నిర్వహించా రు. కొద్దిరోజుల కిందట రఫీ గుండెకు సంబంధించి శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఆదివారం ఆయన అకస్మాత్తుగా అస్వస్థతకు గురై చనిపోయారు. నాయుడుపేట డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి, సీఐ సీహెచ్ ప్రభాకర్‌రావు, ఓజి లి, నాయుడుపేట ఎస్‌ఐలు ఆదిలక్ష్మి, కృష్ణయ్య, వేణు, నెల్లూరు జిల్లా పోలీసు అధికారుల సంఘం గౌరవ అధ్యక్షుడు శ్రీహరి, లక్ష్మినరసయ్య, శేషు, నాయుడుపేట, ఓజిలి స్టేషన్ల పోలీసు సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు. తిరుపతి జిల్లా నుంచి ఏఎస్‌ఐ గంగాధర్ రెడ్డి సారథ్యంలో ప్రత్యేక పోలీసు బృందం హెడ్ కానిస్టేబుల్ రఫీ నివాసం వద్ద పార్థివ దేహానికి గౌరవ వందనం సమర్పించింది. అనంతరం ముస్లిం శ్మశా న వాటికలో గాల్లోకి మూడురౌండ్లు కాల్పులు జరిపి పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలను నిర్వహించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ముసాయిదా

ఓటర్ల జాబితా విడుదల

చిత్తూరు కలెక్టరేట్ : స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ముసాయిదా జాబితాను అధికారులు ఆదివారం విడుదల చేశారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ రాజసింహులు పదవీకాలం ముగుస్తుండడంతో ఆ స్థానానికి మార్చి 13న పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ ఎన్నికలకు ఆర్‌ఓ జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, ఏఆర్‌ఓ రాజశేఖర్ పకడ్బందీగా కసరత్తు నిర్వహిస్తున్నారు. ఈ ఎన్నికలకు సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేశారు. అందులో ఏవైనా అభ్యంతరాలుంటే ఈ నెల 18వ తేదీ వరకు ఇచ్చేందుకు అవకాశం కల్పించారు. అనంతరం వచ్చే అభ్యంతరాలను పరిశీలించి ఈ నెల 22న తుది ఓటర్ల జాబితా విడుదల చేస్తారు. ఈ ఎన్నికలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రాతిపదికన ఒక్కో డివిజన్‌లో ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు చేపడుతున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా ఉండే ఎక్స్‌అఫిషియో మెంబర్లు మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కే రోజా, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, ఎంఎస్ బాబు, భూమన కరుణాకర రెడ్డి, వెంకటేగౌడ, నవాజ్‌బాషా, ప్రతిపక్ష నాయకుడు కుప్పం ఎమ్మెల్యే చంద్రబాబునాయుడు, ఎమ్మెల్సీలు భరత్, రాజసింహులు మొత్తం 11 మంది, ఎంపీటీసీలు 872 మంది, జెడ్పీటీసీలు 65 మంది, కార్పొరేటర్లు 272 మొత్తం 1,220 మంది ఈ ఎన్నికల్లో ఓటర్లుగా ఉంటారు.

విడుదలైన స్థానిక సంస్థల ఓటర్ల జాబితా ఇలా..

డివిజన్ పేరు	ఎంపీటీసీ	జెడ్పీటీసీ	మున్సిపల్ కార్పొరేటర్స్	ఎక్స్ అఫిషియో మెంబర్లు	మొత్తం
శ్రీకాళహస్తి	144	11	0	0	155
తిరుపతి	109	08	76	1	194
నగరి	71	07	29	1	108
చిత్తూరు	124	10	50	3	187
పలమనేరు	153	10	57	2	222
కుప్పం	67	04	25	3	99
మదనపల్లి	204	15	35	1	255
మొత్తం	872	65	272	11	1220

హోరాహోరీగా టీటీడీ ఉద్యోగుల క్రీడా పోటీలు

తిరుపతి అలిపిరి: టీటీడీ ఉద్యోగుల క్రీడాపోటీలు ఆదివారం హోరాహోరీగా సాగాయి. 45 ఏళ్లు పైబడిన మహిళల డాడ్జిబాల్ పోటీల్లో శోభారాణి విజేతగా నిలువగా నిర్మల రన్నరప్‌గా నిలిచారు. 45 ఏళ్లలోపు మహిళల డాడ్జిబాల్ పోటీల్లో ద్రాక్షాయణి విజేతగా, పద్మజ రన్నరప్‌గా నిలిచారు. విశ్రాంత మహిళా ఉద్యోగుల బాల్ బాడ్మింటన్ డబుల్స్ పోటీల్లో సుమతి, లలితమ్మ జట్టు విజయం సాధించగా, భారతి, కృష్ణవేణి జట్టు రన్నరప్‌గా నిలిచింది. విశ్రాంత పురుష ఉద్యోగుల బాల్ బాడ్మింటన్ ఫైనల్స్ పోటీల్లో బాలసుబ్రమణ్యం జట్టు విజయం సాధించగా గోపాలకృష్ణ మూర్తి జట్టు రెండో స్థానంలో నిలిచింది.

బైక్ అదుపు తప్పి..

- రాత్రంతా పొలంలోనే అపస్మారక స్థితిలో
- యువకుడిని రక్షించిన అటుగా వెళ్తున్న పోలీసులు


అపస్మారక స్థితిలో వెంకయ్య

చిల్లకూరు: సోదరిని చూసేందుకు బైక్‌లో వెళ్తున్న ఓ యువకుడు నల్లాయగారి పాళెం సమీపంలో అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లడంతో అపస్మారక స్థితిలో పడిపోయాడు. ఆదివారం ఉదయం అటుగా వెళ్లిన పోలీసులు అతన్ని గుర్తించి 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటన చిల్లకూరు మండలం నల్లాయగారిపాళెం గ్రామ సమీపంలో ఆదివారం జరిగింది. వివరాలు.. దొరవారిసత్రం మండలం వేణుంబాక గ్రామానికి చెందిన యువకుడు మాముడూరు వెంకయ్య చిల్లకూరు మండలం ఉడతావారిపార్లపల్లిలో ఉన్న తన సోదరి రమణమ్మను చూసేందుకు బైక్‌పై వెళ్లాడు. అయితే నల్లాయగారిపాళెం సమీపంలో పెద్దమలుపు వద్ద బైక్ అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. రాత్రంతా పొలంలోని నీటిలో ఉండిపోయింది. దీనికితోడు విపరీతంగా మంచు కురవడంతో శరీరం పూర్తిగా చల్లబడిపోయింది. ఆదివారం ఉదయం చింతవరం వైపు వెళ్తున్న హెడ్ కానిస్టేబుళ్లు నాయబ్ రసూల్, రాధాకృష్ణ పొలంలో పడి ఉన్న బైక్‌ను చూసి ప్రమాదం జరిగినట్లు గుర్తించారు. అపస్మారకంగా పడి ఉన్న వెంకయ్యను 108 సమాచారం ఇచ్చి స్థానిక యువకుల సాయంతో గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. మానవత్వం చాటుకున్న పోలీసులను మండల ప్రజలు అభినందించారు.